క్లుప్తంగా

క్రమశిక్షణతో చదవాలి



విద్యార్థులతో అధికారులు, నాయకులు

రాయచోటి టౌన్ : క్రమశిక్షణతో చదవాలని అప్పుడు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలోని నిదాన్ పాఠశాలలో 10వ తరగతి ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు బేపారీ మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థుల ప్రిపరేషన్‌పై వారు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నిదాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ నిస్సార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : సిద్దవటం మండలం వంతాటిపల్లికి చెందిన రైతు శ్రీనివాసులుయాదవ్ ఇటీవలే విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆకేపాటి శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పించి, అంత్యక్రియలకు రూ.20వేల తన సొంత నగదును అందజేశారు. అదే విధంగా వారి కుటుంబం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు అందజేశారు. అలానే కృష్ణ లాడ్జి యజమాని ఎం.శ్రీనివాసులు యాదవ్, జేవీ కృష్ణారావు యాదవ్, ఎం.వెంకటరత్నం యాదవ్, టి.సుబ్రమణ్యం యాదవ్(కువైట్), బ్యాంకు సుబ్బయ్య యాదవ్, పి.నరసింహులు యాదవ్‌లు రూ.50వేలు నిధులు సేకరించి ఆదివారం మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో మృతుడి కుమారుడికి జెడ్పీ చైర్మన్ నగదును అందజేశారు. కార్యక్రమంలో సహకరించిన వారితో పాటు బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, మధుయాదవ్, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి నగదు, నిత్యావసరాలు..

పుల్లంపేట : పుల్లంపేట మండలానికి చెందిన పాల అమర్నాథ్, ఆయన సతీమణి రెడ్డమ్మలు అనంతంపల్లికి చెందిన జయరాం అనే పేద కుటుంబానికి రూ. 5 వేలు నగదు, నిత్యావసర వస్తువులను తన స్నేహితుడు చింతగింజల గోపినాథ్ చేతులు మీదుగా అందజేశారు. దాతలు ప్రస్తుతం హైదరాబాదులో నివాసం ఉంటూ తన తండ్రి కీ.శేలు పాల వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతోందని వారు తెలిపారు.

వైభవంగా మాచుపల్లె గంగమ్మ జాతర



సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో ఆదివారం ప్రజలు గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలు జాతరను పురస్కరించుకొని మాచుపల్లెలోని వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి గృహానికి వచ్చారు. తరువాత వారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వైఎస్ ఎంపీపీ ఏర్పాటు చేసిన విందులో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి మేడా మదుసూదన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వల్లిచాన్, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గోపాలస్వామి, నీలకంఠారెడ్డి, కె.వి. సుబ్బయ్య, క్రిష్ణచైతన్య, నాయకులు రాజారెడ్డి, వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, మునిరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎం. శ్రీనివాసులరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో మోస్తరు వర్షం

సంబేపల్లె : మండల వ్యాప్తంగా శనివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురినట్లు అధికారులు తెలిపారు. ఉపరితల ఆవర్తనంతో గత రెండు రోజుల నుంచి చెదురుమొదురుగా వర్షం పడినా శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. అధికారుల గణాంకాల ప్రకారం 42.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు ఆదివారం తెలిపారు.

నవమి ఉత్సవాలు.. బండ్రాళ్ల వీధిలో ప్రత్యేకం

- 22 నుంచి రాములోరి జయంతి ఉత్సవాలు ప్రారంభం
- 30న సీతారాముల కల్యాణం



ఆలయంలోని సీతారామలక్ష్మణ విగ్రహాలు



బండ్రాళ్ల వీధిలోని రామాలయం

రాజంపేట టౌన్ : సాధారణంగా శ్రీరామ జయంతి ఉత్సవాలను శ్రీరామనవమి రోజు నుంచి ప్రారంభమవుతాయి. అయితే పట్టణంలోని బండ్రాళ్ల వీధిలోని పురాతన సీతారాముల ఆలయంలో రాములోరి ఉత్సవాలు అందుకు భిన్నంగా నిర్వహిస్తారు. ఇక్కడ ఉగాది పర్వదినాన ఉత్సవాలను ప్రారంభమై శ్రీరామనవమి రోజున ముగుస్తాయి. దాదాపు వంద సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన బండ్రాళ్ల వీధిలోని రామాలయం ఎంతో విశిష్టతను సంతరించుకుంది. శ్రీరామనవమిని పురస్కరించుకొని ఇక్కడ నిర్వహించే ఉత్సవాలను గర్భ జయంతి ఉత్సవాలని పిలుస్తుంటారు. ప్రతి ఏడాదిలాగే ఈ యేడు రాములోరి జయంతి ఉత్సవాలను ఆలయ ధర్మకర్త గొబ్బూరు వెంకటసుబ్బయ్య నేతృత్వంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదుద్దుతున్నారు.

ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలు

నవమి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ఆలయంలో సీతారాములు ప్రత్యేక అలంకరణలలో దర్శనమివ్వనున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శశి స్వామి నేతృత్వంలో నిత్యం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ప్రత్యేక అలంకరణలో కొలువయ్యే సీతారాములను దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలి వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఈనెల 30వ తేదీ శ్రీరామనవమిని పురస్కరించుకొని రాములోరి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

శ్రీవారి సేవకులు చక్కగా సేవలందించాలి



మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం



పాల్గొన్న శ్రీవారి సేవకులు

టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

ఒంటిమిట్ట(రాజంపేట) : కోదండరాముని బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవంలో పాల్గొనే శ్రీవారి సేవకులు చక్కగా సేవలందించి విజయవంతం చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం కోరారు. ఆదివారం స్థానిక టీటీడీ సమావేశ భవనంలో శ్రీవారి సేవకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5న జరిగే కోదండరాముని కల్యాణం రోజున సాయంత్రం 4 గంటల నుంచి భక్తులు గ్యాలరీలోకి వస్తారన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదం, అక్షింతలు, పసుపు, కుంకమ, వాటర్ ప్యాకెట్లు ఉంచిన బ్యాగును అందించాలన్నారు. శ్రీ వారి సేవకులు ఈ బ్యాగులను భక్తులకు అందజేయాల్సి ఉంటుందన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా ఓపికతో వ్యవహరించాలన్నారు. శ్రీవారి సేవకులు ఎక్కడ సేవ చేయాలో నిర్ణయించి అందుకు సంబంధించి పాసులను ముందే ఇస్తామని జేఈఓ చెప్పారు. సేవ కోసం వచ్చే వారికి ఆహారం ఇతర సదుపాయాలు కల్పిస్తామన్నారు. టీటీడీలో శ్రీవారి సేవ విభాగానికి ఎంతో గౌరవం, గుర్తింపు ఉన్నాయన్నారు. టీటీడీ పీఆర్‌ఓ రవి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో సేవలందించడంలో శ్రీవారి సేవకులు పాత్ర ప్రధానమైనదన్నారు. శ్రీవారి సేవకులపై టీటీడీకి అపార నమ్మకం ఉందన్నారు. సమావేశంలో ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ కుమార్, టీటీడీ చీఫ్ ఇంజనీరు నాగేశ్వరరావు, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, శ్వేత డైరక్టర్ ప్రశాంతి, వీజీఓ మనోహర్ పాల్గొన్నారు.

జోరుగా కుక్కల పట్టివేత

రాజంపేట రూరల్ : పట్టణంలోని కుక్కల పట్టివేత కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. ఇటీవల పట్టణంలో వరుసగా కుక్కలు దాడి చేయడంతో ప్రజలు గాయాలపాలయ్యారు. ఇదే విషయం సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యింది.

మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, కమిషనర్ ఎం.జనార్దన్‌రెడ్డిలు చొరవ తీసుకొని తిరుపతిలోని అనిమల్ కేర్ సెంటర్ నిర్వాహకులతో సంప్రదించి కుక్కల పట్టివేతకు శ్రీకారం చుట్టారు. గత మూడు రోజుల నుంచి పట్టణంలో కుక్కలను పట్టివేయడంతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. కుక్కల బెడదపై పట్టణ ప్రజలు భయపడాల్సిన పనిలేదని మున్సిపల్ చైర్మన్, కమిషనర్ తెలియజేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



బ్లడ్ డొనర్‌కు ధృవీకరణ పత్రం ఇస్తున్న నిర్వాహకులు, ప్రతినిధులు

గాలివీడు : రక్తదానం చేయడం ద్వారా వేరొకరికి ప్రాణదాతలుగా నిలుస్తారని దీపా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రం గేటు నాలుగురోడ్ల కూడలిలోని 108 కార్యాలయంలో గాలివీడు యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 32 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు రామాంజుల ఆచారి, ప్రశాంత్, బాబ్జీ, వెంకటరెడ్డి, అజంతుల్లా, కరీం, మహబూబ్ బాషా, అల్తాఫ్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : తిరుపతి సంకల్ప సూపర్ స్పెషాలటీ హాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్స్, యురాలజిలతోపాటు సాధారణ జబ్బులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 150 మంది రోగులకు వైద్య సేవలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండ్ల సోమేశ్వర్, నాయకులు వి.ప్రతాప్‌రెడ్డి, వి.వి జయకుమార్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, ఈఓఆర్‌డీ రవీంద్ర, వైద్యులు శ్రీకాంత్, విజయ్ భరద్వాజ్, రమేశ్, సౌందర్య, పీఆర్‌ఓ ఖాదర్‌వలీ, కార్పొరేట్ మేనేజర్ రవికుమార్, సంకల్ప హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మిట్టా రామచంద్రారెడ్డికి సత్కారాలు



రాయచోటి టౌన్: రమణారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం



పుల్లంపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

పుల్లంపేట : రాజంపేట కాకతీయ విద్యాసంస్థలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో విజేతగా మిట్టా రామచంద్రారెడ్డి నిలిచినందుకు ఆత్మీయ అభినందన సభను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎస్‌బీవీడీ విద్యాసంస్థల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, నరేంద్ర, శ్రీనివాసులు, సోము బాలాజీ తదితర ప్రైవేటు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మిట్టా రామచంద్రా రెడ్డిని కలిసి సన్మానించారు. అనంతరం నూకల శ్రీరాములు ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలను రామచంద్రారెడ్డికి వివరించారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన ఎంవీ రమణారెడ్డిని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌టీఎఫ్ నాయకులు కలసి అభినందనలు తెలియజేశారు. ఆదివారం ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సన్మానించారు. ఆయనను కలసిన వారిలో అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌టీఎఫ్ అధ్యక్షులు రెడ్డెప్పరెడ్డి, జిల్లా నాయకులు పొట్టిరెడ్డి, శ్రీధర్, చంద్రశేఖర్ రెడ్డి, రియాజ్, రవి, శివ, శంకర్ రెడ్డి, గోవిందరెడ్డి, శ్రీనివాసులు, నలంద స్కూల్ కరస్పాండెంట్ స్వామి, తదితరులు కలసిన వారిలో ఉన్నారు. వెస్ట్ రాయలసీమ ఎమ్మెల్సీగా గెలుపొందిన కడప సాయిబాబా స్కూల్ కరస్పాండెంట్ ఎంవీ రమణారెడ్డిని పీఎస్టీఎఫ్ నాయకులు కలసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంవీ రమణారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు బేపారీ మహమ్మద్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సహాయ సహకారాలతోనే తాను విజయం సాధించానని చెప్పారు. ఆయనను కలసిన వారిలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీసీ రెడ్డెన్న, రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.మునిరెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సి. ఓబుల్‌రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఎస్ఎం జక్రియా బాషా, కార్యదర్శి సయ్యద్ బాష, అసోసియేట్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సయ్యద్ సిబకతుల్లా, కన్వీనర్ జమీర్ ఉన్నారు.

యూపీ విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు



మాట్లాడుతున్న విద్యుత్ యూనియన్ నేతలు

రాయచోటి అర్బన్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించేందుకు యోగి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ ఆ రాష్ట్రవిద్యుత్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెలకు తాము మద్దతునిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.వి.రమణ, యూఈఈయూ జిల్లా నేత సుబ్రమణ్యం రాజులు తెలిపారు. ఆదివారం స్థానికంగా ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం తీసుకువస్తున్న విద్యుత్ సవరణల చట్టం- 2022ను వెంటనే రద్దుచేయాలంటూ వారు డిమాండ్ చేశారు. ఏపీలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలైన ఈపీఎఫ్, జీపీఎఫ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. 2022 వేతన సవరణ చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని విడుదల చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. పక్క రాష్ట్రమైన కర్నాటకలో ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులకు 20శాతం వేతనం పెంచిందని, తెలంగాణ ప్రభుత్వం 15శాతానికి వేతనం పెంచుతామని పరోక్షంగా సంకేతాలు ఇస్తోందన్నారు. ఏపీలో ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులకు జీతాల పెంపుతో పాలు పలురకాల సమస్యలను పరిష్కరించాలన్నారు.

అంగన్‌వాడీల అరెస్టులు అప్రజాస్వామికం

రాయచోటి అర్బన్ : చలో విజయవాడ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సిద్ధమవుతున్న అంగన్‌వాడీలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్, కెవిపిఎస్ అన్నమయ్య జిల్లా కన్వీనర్ వెంకటయ్యలు ఖండించారు. ఆదివారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ తమ న్యాయ సమ్మతమైన కోర్కెల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న అంగన్‌వాడీలపై నిర్బంధం తగదన్నారు. శాంతియుతంగా పోరాడుతున్న అంగన్‌వాడీలకు తమ నిరసనను తెలిపే హక్కు లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమ అరెస్టులకు స్వస్తిపలికి, అంగన్‌వాడీల న్యాయ సమతమైన సమస్యలను పరిష్కరించాలంటూ కోరారు.

పది విద్యార్థులకు ప్రణాళికే ప్రధానం

మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న పోలా శ్రీనివాస్‌రెడ్డి

రాజంపేట టౌన్ : మరో రెండు వారాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నందున విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా చదవాలని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక బాలికల ఇంటిగ్రేడెట్ హాస్టల్‌లో వసతి గృహ అధికారిణి శోభారాణి ఆధ్వర్యంలో ఆదివారం టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణా తరగతుల కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. హాస్టల్‌లో చదివే విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు వసతి గృహ అధికారిణి పాఠ్యాంశ నిపుణలచే ప్రేరణా తరగతులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పాఠ్యాంశ నిపుణుల చెప్పిన విషయాలను విధిగా పాటించి విద్యార్థులందరు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పోలా ఆకాంక్షించారు. పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున విద్యార్థులు ఏయే పాఠ్యాంశం ఎప్పుడు చదవాలో ఒక టైం టేబుల్‌ను వేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు పదవ తరగతి ఓ మలుపులాంటిదన్నారు. అందువల్ల ఏమాత్రం సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలన్నారు. చదువుతో పాటు ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు రాస్తున్నందున అనేక మంది విద్యార్థులకు వారిలో వారికే తెలియని భయం ఉంటుందని, అయితే ఎలాంటి భయాందోళనలు పెట్టుకోకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకొని చదివిన విషయాలను పరీక్షలో బాగా రాయాలని సూచించారు. ఏబీటీఎస్ అసోసియేట్ ప్రొఫెసర్, వ్యక్తిత్వ వికాస నిపుణులు కాశిగారి ప్రసాద్ పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళన చెందకుండా మనస్సు చదువుపైనే ఉంచుకునేందుకు చేపట్టాల్సిన విషయాల గురించి వివరించారు. పాఠ్యాంశ నిపుణులు వారి పాఠ్యాంశాల్లో సులువుగా మార్కులు సాధించే విధానం గురించి తెలిపారు. అలాగే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి, హాస్టల్ వార్డెన్ శోభారాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, పాఠ్యాంశ నిపుణులు గంగనపల్లె వెంకటరమణ, దయానంద్, ఆదిలక్ష్మి, నరసింహారావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు



సంబేపల్లె: అలంకరణలో నల్లగంగమ్మ



చిన్నమండెం: భక్తులకు దర్శనమిస్తున్న మల్లూరమ్మ



లక్కిరెడ్డిపల్లె: అలంకారంలో అనంతపురం గంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మల్లూరమ్మ ఆలయంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

గంగమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ దర్శనానికి ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వేలాది మంది భక్తులు రావడానికి రావడంతో క్యూ లైన్‌లో గంటల కొద్ది వేచి ఉండటంతో ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హక్కుల కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలి

మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు కె.కోనయ్య



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పెనగలూరు : హక్కుల కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు కె.కోనయ్య అన్నారు. ఆదివారం పెనగలూరులో మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవ హక్కుల సంఘం కోడూరు నియోజకవర్గ అధ్యక్షుడు వలిమి అరవిందబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోనయ్య మాట్లాడుతూ మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అందుకే ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమాజంలో అసమానతలను తొలగించి, రేపటి తరానికి స్వేచ్ఛతో కూడిన భారతదేశానికి అందరూ నడుం బిగించాలన్నారు. అంతకుముందు మానవహక్కుల అవగాహన సంఘం సభ్యులు పలువురు మాట్లాడారు. మొదటగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడ నుంచి ర్యాలీగా సమావేశానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో మానవ హక్కుల అవగాహన సంఘం రాష్ట్ర ఈసీ మెంబర్ రవికుమార్, స్టేట్ లేబర్ వింగ్ చైర్మన్ ఓబులేశు, రాయలసీమ రీజన్ మీడియా చైర్మన్ రాఘవ, రాయలసీమ వైస్ చైర్మన్ సురేష్ బాబు, కడప జిల్లా ఛైర్‌పర్సన్ శిల్పారెడ్డి, కడప జిల్లా వర్కింగ్ వింగ్ చైర్మన్ రామకృష్ణ, రైల్వేకోడూరు నియోజకవర్గ చైర్మన్ అరవిందబాబు, కోడూరు నియోజకవర్గ సెక్రటరీ ఎద్దుల శంకరయ్య, షేక్ మక్బూల్, షేక్ నాజర్, మొహిద్దీన్ పాల్గొన్నారు.

బారికేడ్లు.. చెత్తకు నిలయాలు

జాతీయ రహదారిపైనే యథేచ్ఛగా డంప్ చేస్తున్న స్థానికులు



బారికేడ్ల వద్ద నిలువ ఉన్న చెత్తాచెదారం

రామాపురం : ఒక వైపు వర్షాలు, వ్యాధులతో సతమతమవుతున్న గ్రామాలలో చెత్తాచెదారాలు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో జాతీయ రహదారి మధ్యనున్న బారికేడ్ల వద్ద చెత్తాచెదారాలకు నిలయాలుగా మారాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్తాచెదారాలు నిండి దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన చెత్తవేయడం మానడం లేదు. డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ చెత్తాచెదారం తరలింపు నామమాత్రంగా ఉందని ప్రజలు పేర్కొన్నారు. ముఖ్యంగా దుర్గంధం వెదజల్లి పశువులు, కోళ్లు, కుక్కలు వాటిని లాగి బయటకు వేయడంతో గాలి వచ్చినప్పుడల్లా ఇండ్లవైపుకు వస్తున్నాయని ఇంటి యజమానులు, వ్యాపారస్తులు వాపోతున్నారు. ఈ చెత్తాచెదారాన్ని ప్రతి రోజూ అధికారులు, ప్రజాప్రతినిధులు అనునిత్యం రహదారిపై వెళ్తున్నప్పటికి చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వాసులు కోరుతున్నారు.

కౌలుకు ఆలయ భూములు

బి.కొత్తకోట: స్థానిక చౌళేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాలకు చెందిన భూములను రైతులకు కౌలుకు ఇవ్వనున్నట్టు దేవదాయశాఖ ఈఓ ఎ.మునిరాజ ఆదివారం తెలిపారు. దీనికోసం ఈనెల 23న వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రూ.3వేలు డిపాజిట్టు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. సుమారు 95 ఎకరాలకు వేలం నిర్వహించనున్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



అమ్మవారి ముందు వరపడిన మహిళలు

గుర్రంకొండ : చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతా భిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు ఆలయ మెట్లకు పూజలు నిర్వహిస్తూ మొకాళ్లపైనడిచి ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.